# మఱఱ

## స్మైల్

భారతికి మురళి అంటే భయం.

అతను వికృతంగా ఉంటాడు.

అతని చూపులు వాడిగా ఉంటాయి.

అతని నడక కృత్రిమంగా ఉన్నట్లుంటుంది.

అతను ఏమి చేస్తాడో, ఎందుకు చేస్తాడో తెలిసికోవడం కష్టం. అతడు మూగవాడు. అతనికి చెవుడు కూడ. అతనికి ఎవరూలేరు. భారతికి అతను బావ. "మూగబావ" - ఇది భారతి అభిప్రాయం అతని గురించి.

"పాపం, చనిపోతూ నా చేతుల్లో పెట్టింది సుశీల-ఎవరు చూస్తారు నేను చూడకపోతే!" ఇది సుందరంగారి అభిప్రాయం.

సుశీల మురళి తల్లి. అతని తండ్రి అతని చిన్నతనంలోనే పోయాడు. సుందరం భారతి తండ్రి. సుశీల సుందరం చెల్లెలు.

"వీడు మా కొక పీడ, లంపటం" - ఇది సౌభాగ్యమ్మ అభిప్రాయం. సౌభాగ్యమ్మ భారతి తల్లి.

మురళి వీళ్లందరి గురించి గట్టిగా ఆలోచించడు. అతని జీవితం యాంత్రికం. అతనికి భారతి అంటే ప్రేమ. ప్రేమ మూగది. అతడూ మూగవాడే మరి! తనకు భారతి అంటే ప్రేమ అని వ్యక్తం చేద్దాం అనుకునేవాడు మురళి. కాని, భారతి అమ్మగారు ఏమంటారోనని అతనికి భయం. భారతి తననుంచి దూరంగా తప్పుకు తిరుగుతూందని అతనికి తెలియదు. భారతిని ఆకర్షించాలని మురళి అనుకునేవాడు. అతని ముందు అద్దం అబద్ధం ఆడలేదు. తనంటే భారతి ప్రేమ చూపలేదేమో అనుకునేవాడు ఒక్కోసారి. అయినా భారతి- అందమైన భారతి తన దగ్గరకు ఎందుకు వస్తుంది అనుకునేవాడు మరోసారి. భారతి అంటే అదొక రకమైన అభిమానం తాను ఎందుకు చూపాలో, ఎందుకు చూపుతున్నాడో అతనికి తెలిసేదికాదు.

యౌవనపు తొలి మెట్టు ఎక్కాడు మురళి. యౌవనంలో అందరికీ ఉండే తీయని ఆలోచనలూ, తీయని భావాలూ అతనికీ ఉన్నాయి. కాని, ఆలోచనలు మాటకు అందవు. భారతి ఎక్కడుంటే అక్కడుండడానికి ప్రయత్నించేవాడు మురళి. ఎందుకో భారతిని చూస్తే అతని మనసులో ఏవో ఆలోచనల అలలు చెలరేగేవి.

సౌభాగ్యమ్మ మురళిని మందలించేది. "ఎందుకు ఆడపిల్లల దగ్గర" అనేది. మురళి కిది విన్పించదు; తెలియదు. అతనికి కావలసింది భారతి రూపం. ఆ రూపాన్ని తనది చేసుకుంటే.... అనుకునేవాడు మురళి.

మురళి ఒకసారి సినిమా చూశాడు. అందులో నటుడు, నటిని కౌగిలించుకున్నాడు. మురళి ఆ నటుడు తనే అనుకున్నాడు. నటి భారతి. ఒకసారి మురళి భారతి గదిలోకి వెళ్ళాడు. ఆమె నిద్రలో ఉంది. నిద్రలో ఎంత అందం అనుకున్నాడు మురళి. నిద్రలోనే భారతిని తను స్పృశించగల ననుకున్నాడు. భారతి చెక్కిలిమీద మురళి చేతితో నిమిరాడు.

భారతి లేవలేదు. మురళికి ఏదో ఆవేశం క్రమ్మినట్లయింది. వంగాడు. భారతి నుదురుకు ఎదురుగా అతని పెదాలు.... భారతి లేవలేదు. భారతి నుదురుమీద అతని పెదాలు. భారతి కదిలింది. లేవలేదు. మురళికి ధైర్యం వచ్చింది. అతని నరాల్లో విద్యుత్తులా ఏదో విచిత్రానుభూతి, ఆవేశం, ఉద్రేకం! భారతి నుదురు - అతని పెదాలు -

భారతి ఉలికిపడి లేచింది. ఆమె వదనం మీద మురళి ముఖం. నల్లని వికృత వదనం. భారతి కెవ్వున అరచింది. మురళి మొగం వెన్నెల్లా పాలిపోయింది. ఆమె మొగం నేలమీద పడ్డ కిరసనాయిల్లా ఉంది.

సౌభాగ్యమ్మ ప్రత్యక్షమైంది అక్కడ. మురళి బెదిరాడు. కాని, భారతి నుదురులోని మాధుర్యం అతని పెదాలు ఇంకా కావాలంటున్నాయి.

సౌభాగ్యమ్మ మురళిని తిట్టింది. కఱ్ఱతెచ్చి వీపు పగిలేట్లు కొట్టింది. మురళి తల వంచుకు సహించాడు. మాధుర్యాన్ని రుచి చూచిన అతనికి దెబ్బలు చేదు అన్పించలేదు. జీవితానికి అదే మొదటి అనుభవం. అదే ఆఖరు అనుభవం. దెబ్బలు తిన్నా భారతి నుదురును నదురు బెదురు లేకుండా మరోసారి చుంబించాలనుకున్నాడు. మరొకసారి అవకాశం రాదని తెలుసు అతనికి. దెబ్బలు భరించి, తిట్లు తిని బయటకు వెళ్ళిపోయాడు మురళి.

ఆ రోజు అతను అతని గదిలోంచి బయటకు రాలేదు. అతని గది గొడ్లపాకలో. అతనికి ప్రక్క కంటె అక్కడి గడ్డి మెత్తగా ఉంటుంది. అందుకే గడ్డి అంటే అతనికి ఇష్టం. భారతి ముందుకు వెళ్ళాలంటే మురళికి సిగ్గనిపించింది. నాలుగు రోజుల తర్వాత భారతి మురళి కంటబడింది. తుపుక్కున ఉమిసి "ఛీ!" అని వెళ్ళిపోయింది. మురళి నవ్వలేక నవ్వాడు.

మరొక రోజు మురళి భారతి గది దగ్గరకు వెళ్ళాడు. పిల్లులంటే మురళికి ఇష్టం. అందుకే పిల్లిలా నడిచి వెళ్ళాడు. భారతి గదిలోలేదు. సౌభాగ్యమ్మ ఎక్కడుందోనని చూశాడు. ఆవిడ ఉన్నా లేనట్లుంది. భారతి గదిలో టేబిల్ మీద భారతి ఫోటో ఉంది. మురళి మెల్లిగా గదిలోకి వెళ్ళాడు. భారతి ఫోటోలో నవ్వుతూంది. 'నవ్వు ఎంత అందంగా ఉంది' అనుకున్నాడు మురళి మనసులో. ఫోటో అందుకున్నాడు మురళి చేతికి. 'భారతి తన చేతిలో ఉంది' అనుకున్నాడు మురళి.

గబగబ తన గదిలోకి వెళ్ళాడు మురళి. భారతి ఫోటోవైపు చూశాడు. భారతి నవ్వుతూంది. మురళి నవ్వాడు.

అతనికి ఆరోజు చూసిన సినిమా స్మృతిలో మెరిసింది.

నటుడు - నటి - కౌగిలి -

తను - భారతి - కౌగిలి -

తను - భారతి - కౌగిలి - ఎట్లా?

భారతి ఫోటో మురళి వక్షంమీద పెట్టుకున్నాడు. ఏదో ఆనందం! ఏదో మాధుర్యం! ఏదో అనుభూతి! భారతి అతని గుండెలమీద ఉంది. తను భారతిని తన గుండెల మీద పెట్టుకున్నాడు.

తియ్యని కలలు వస్తాయేమో అనుకున్నాడు ఆ రాత్రి. కలలు రాలేదు. కాని, మరుసటి రోజు నిజంగా భారతి వచ్చింది అతని గది దగ్గరకు. మురళి భారతిని చూసి నవ్వాడు. భారతి ముగళి వైపు వేడిగా చూసింది. మురళి ఇంకా నవ్వుతూనే ఉన్నాడు. భారతికి కోపం వచ్చింది. సంజ్ఞను చేస్తూ అడిగింది - "ఫోటో తీశావా?" అని. మురళి 'లేదు' అన్నట్లు తల ఊపాడు. ఆ ఫోటో అతని దిండు క్రింద ఉంది.

మురళి భారతికి సంజ్ఞలు చేశాడు ఫోటో అసలు ఎవరిదీ అన్నట్లు.

"నాదే" అని తనను తనే చూపుకుంది వ్రేలితో భారతి.

తల ఊపాడు తెలియదన్నట్లు మురళి.

"ఛీ! ఛీ!" అని వెళ్ళిపోయింది భారతి.

మురళి తనలో తనే నవ్వుకున్నాడు. దిండు క్రింద నుంచి ఫోటోతీసి చూసుకున్నాడు. ఏదో తృప్తి. భారతి వెళ్ళినా, కోపగించుకున్నా భారతి ఫోటోలో నవ్వుతుందని తృప్తి.

మురళి భారతి ఫోటోను గుండెలమీద పెట్టుకొని ఆనందించేవాడు. మురళి భారతి ఫోటోను ముద్దు పెట్టుకునేవాడు. మురళి భారతి ఫోటో మీద పూలు గుమ్మరించేవాడు. మురళికి భారతి ఫోటో ప్రాణం. భారతికి మురళి అంటే అసహ్యం! ద్వేషం! అయినా మురళికి భారతి దేవత. అతనికి నక్క ద్రాక్షపళ్ళ కథ తెలియదు. అతనికి చదువు రాదు.

భారతదేశంలో సామాన్య మానవుడు మోసే పరోక్షపు పన్నుల భారంలా భారతి 'ఛీ ఛీ' లను భరించేవాడు మురళి. భారతి 'ఛీ' అని ఉమ్మివేస్తే మురళికి మోదం! అతనికి కలిగేదికాదు కాస్తయినా ఖేదం!

'మురళికి భారతి అంటే చచ్చేంత ప్రేమ' అనుకొనేవారు కొంతమంది.

'మూగవాడైతే మాత్రం? కోరికలు, వాంఛలు ఉంటాయి' అనేవారు కొంతమంది.

'నక్క, నాగలోకం!' అనేవారు కొంతమంది. నాగలోకం చేరుదామని ఈ మురళి అనే నక్క చాల ప్రయత్నాలు చేశాడు.

అద్దంముందు చాలసేపు నిలిచేవాడు. అతనిది వంకీల జుట్టు. దాన్ని గంటసేపు దువ్వేవాడు. భారతి తన శిరోజాలను మెచ్చుకుంటుందని అతని ఆశ. కాని హఠాత్తుగా అతని గుండెల్లో కూర్చుంది కుర్చీ వేసుకుని నిరాశ.

ఒక రోజు ఇంటికి వెల్లవేయించడం చూశాడు మురళి.

ఇల్లు రోజు రోజుకు అలంకరించబడుతూంది. ఎవరినో ఏమిటి కథ అన్నట్లడిగాడు. భారతిని చూపి పెళ్ళి అన్నట్లు చూపారు వాళ్ళు. మురళి గుండెల్లో రాయి పడింది! మురళి గుండెల్లో చీకటి పడింది. తనేం చేయగలడు అనుకున్నాడు మురళి. తనను 'ఛీ' అన్నా తనతోనే ఉంటుంది భారతి అనుకున్నాడు మురళి. కాని.....

భారతి పెళ్ళికూతురైంది. అందంగా ఉంది - అనుకున్నాడు మురళి తనలో. భారతి సిగ్గుతో తల వంచుకు కూర్చుంది. 'ఇంకా అందంగా ఉంది' - అనుకున్నాడు మురళి. భారతి ప్రక్కనే అతను. అతను తను కాదు. తను అతను కాదు. అతను అందంగా ఉన్నాడు. భారతివైపు గర్వంగా చూస్తున్నాడు. 'భారతి నాది' అన్నట్లున్నాయి అతని చూపులు. 'భారతి ఫోటోయే నాది' అనుకున్నాడు మురళి. మురళి మూగవాడు. మురళి మనస్సుకూడా మూగవోయినట్లయింది.

అతను మంగళసూత్రం కట్టాడు భారతికి. తన కా అదృష్టం లేదనుకున్నాడు మురళి. గట్టిగా నిట్టూర్చాడు మురళి. అక్షతలు గట్టిగా విసిరాడు అతనిమీదికి మురళి. అవి తగిలి అతను చచ్చిపోవాలనుకున్నాడు మురళి. తన సర్వస్వాన్ని లాక్కుపోతున్నాడు అనుకున్నాడు మురళి. భారతి తన సర్వస్వం. కాని తాను- భారతికి తను సర్వస్వం కాదు.

పెళ్ళి అయిపోయింది. భారతి వెళ్లిపోయింది. మురళికి భారతి మళ్ళీ కన్పించదు. మురళికి భారతి ఫోటో కన్పిస్తుంది. ఆ ఫోటో నవ్వుతుంది. ఆ ఫోటో తనను కవ్విస్తుంది. వెళ్ళేటప్పుడు భారతి మురళికి చెప్పలేదు వెళ్తున్నానని. సౌభాగ్యమ్మ మురళిని దగ్గరకు రానీయలేదు పెళ్ళిలో.

నా బ్రతుకెందుకు అనుకున్నాడు మురళి. నా బ్రతుకెవరికి అనుకున్నాడు మురళి. భారతి తనకులేదు. మురళి కళ్ళలో నిరాశ నిండింది. అతని గుండెల్లో వేదన హెచ్చింది. అతను గదిలోనే ఉండేవాడు. బయటకు వచ్చేవాడు కాదు. చీకటిలో ఉండాలనిపించేది అతనికి. జీవితం చీకటి అయినప్పుడు తను వెలుగు చూడకూడదనుకున్నాడు మురళి. వెలుగంటే ద్వేషం మురళికి.

"ఎందుకురా, మురళీ, అట్లా వున్నావ్?" అనే వాడు సుందరం సంజ్ఞలు చేస్తూ.

మురళి ఏమీ లేదన్నట్లు తల త్రిప్పేవాడు.

"తల బిరుసు వెధవకు" అనేది సౌభాగ్యమ్మ.

మురళి తన జీవితం శూన్యం అనుకున్నాడు. మురళి తన జీవితం హీనం అనుకున్నాడు. వేసవి వెళ్ళిపోయింది. భారతి వచ్చి వెళ్ళిపోయింది అత్తగారింటికి. వర్షాకాలం వచ్చింది. భారతి రాలేదు. మురళి మిగిలాడు. భారతి ఫోటో మిగిలింది.

మురళికి ఒక రోజు వర్షంలో తడిసిన కుక్క పిల్ల దొరికింది. అది చలికి గజ గజ లాడుతూంది. అది దీనంగా చూసింది మురళివైపు. మురళి మనసు కరిగింది దాన్ని చూస్తే. కుక్కపిల్లను ఇంటికి తెచ్చాడు మురళి. చలిమంటవేసి, కుక్కపిల్ల ఒళ్ళు తుడిచాడు మురళి.

'కుయ్‌కుయ్' అంది కుక్కపిల్ల సంతోషంగా. సౌభాగ్యమ్మ దగ్గరకు వెళ్ళాడు మురళి. కుక్కపిల్లకు వేడిపాలు కావాలన్నట్లు సంజ్ఞలు చేశాడు. సౌభాగ్యమ్మ విసుక్కుంది.

"ఈ కుక్కకు మరో కుక్క!" అంది.

"ఇవ్వరాదటే?" అన్నాడు సుందరం.

"ఊఁ! వాణ్ణి వెనకేసుకురావడం తెలుసుమీకు" అంది సౌభాగ్యమ్మ. చివరికి గిన్నెలో పాలుపోసి ఇచ్చింది.

మురళి కుక్కపిల్ల దగ్గరకు పరుగెత్తబోయాడు. బురదలో కాలు జారింది. పడ్డాడు. పాలు ఒలికిపోయాయి. నుదుటికి దెబ్బ తగిలింది. శరీరం అంతా బురద అంటింది. మురళికి కళ్ళలో నీళ్ళు నిల్చాయి. కుక్కపిల్ల చచ్చిపోతుందేమో అని భయం వేసింది. అది చావకూడదు

అనుకున్నాడు మురళి. పాలు కావాలి, ఎట్లా? హోటలుకు పరుగెత్తాడు గ్లాస్ తీసుకొని. పాలు తీసుకుని డబ్బు మళ్ళీ ఇస్తానని వచ్చేశాడు.

కుక్కపిల్ల అతని పక్కమీద ముడుచుకు కూర్చుంది.

"మ అ ఆ" అన్నాడు మురళి.

"నే వచ్చేశా" అన్నట్లు పరుగెత్తుకువచ్చింది కుక్కపిల్ల.

పాలు గిన్నెలోపోసి 'మ అ ఆ' అన్నాడు మురళి.

పాలు త్రాగింది కుక్కపిల్ల. తృప్తిగా చూసింది అతనివైపు కుక్కపిల్ల. తృప్తిగా నిట్టూర్చాడు మురళి. కుక్కపిల్ల - తన కుక్కపిల్ల బ్రతుకుతుంది అనుకున్నాడు.

మురళికి కుక్కపిల్ల అంటే ప్రాణం. భారతిని అతను మరచిపోయేవాడు కుక్కపిల్లను లాలిస్తూ. 'మ అ ఆ' అంటే కుక్కపిల్ల పరుగెత్తుకు వచ్చేది మురళి దగ్గరకు.

ఒక రోజు కుక్కపిల్ల భారతి ఫోటోను దిండు కింద నుంచి లాగి నోటితో కరుచుకొని అతని దగ్గరకు వచ్చింది. మురళి హృదయంలో గాయం రేగింది. భారతి ఒకసారి వస్తే బావుండును అనుకున్నాడు. భారతి ఫోటోను హృదయానికి హత్తుకున్నాడు. నిట్టూర్చాడు. భారతి నిజంగానే నాలుగు రోజుల తర్వాత వచ్చింది అతనితో. మురళి చాలకాలం తర్వాత నవ్వాడు. తృప్తిగా నవ్వాడు. భారతి - తనకు కాకుండా పోయిన భారతి వచ్చింది అనుకున్నాడు.

భారతి మురళిని చూసింది. 'ఎట్లా వున్నావ్' అన్నట్లు అడిగింది. మురళి తల ఊపాడు. కుక్కపిల్ల పరుగెత్తుకు వచ్చింది. 'మ అ ఆ' అన్నాడు.

'ఎవరిదిది?' అన్నట్లు కుక్కపిల్లను చూపింది భారతి.

నాదే అన్నట్లు చేయి ఊపాడు మురళి.

"మ అ ఆ" అన్నాడు మురళి మళ్ళీ.

అతను - భారతిని తననుంచి లాక్కుపోయినవాడు - వచ్చాడు. కుక్కపిల్లను ముద్దుగా చేత్తో గట్టిగా కొట్టాడు.

అట్లా కొట్టే అధికారం నన్ను 'మ అ ఆ' అనేవాడిదే, నీది కాదన్నట్లు - కుక్కపిల్ల భారతి భర్త చేతిని గట్టిగా కరిచింది.

"అమ్మో!" అన్నాడు అతడు.

మురళి నవ్వాడు గట్టిగా.

భారతి భర్త చేతిలోంచి రక్తం చిమ్ముతూంది.

కుక్కపిల్ల పళ్ళగాట్లు అతని చేతిమీద కన్పిస్తుంటే మురళి ఇంకా గట్టిగా నవ్వాడు.

సౌభాగ్యమ్మ పరుగెత్తుకువచ్చింది ఏం జరిగిందంటూ. జరిగింది తెలిసి కుక్కపిల్లను కర్రతో చచ్చేట్లు కొట్టింది. 'కుంయో, కుంయో!' అని విలపించింది కుక్కపిల్ల.

మురళి 'మ అ ఆ' అంటూ కుక్కపిల్లను తీసుకుపోయాడు. తన గదిలో కూర్చుని కుక్కపిల్లను గుండెల కదుముకుని ఏడ్చాడు. దాని వళ్ళు నిమిరాడు. కుక్కపిల్ల 'కుంయ్! కుంయ్!' అంటూ అతని ఒళ్ళో ఇముడుకుపోయింది.

"మ అ ఆ" అని మళ్ళీ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు మురళి.

ఆ రోజు రాత్రి అతనికి నిద్రలేదు.

అందరూ మురళిని తిట్టారు.

"చంపించేస్తా కుక్కపిల్లను" అంది సౌభాగ్యమ్మ.

మురళికిది తెలియదు.

నాలుగు రోజుల తర్వాత కుక్కపిల్ల కన్పించలేదు మురళికి.

"మ అ ఆ" అంటూ పిచ్చిగా పరుగెత్తాడు ఇంట్లో మురళి.

"మ అ ఆ" అంటూ పిచ్చివాడిలా అరిచాడు మురళి.

"ఎందుకురా వెధవా, అట్లా అరుస్తావ్?" అంది సౌభాగ్యమ్మ.

"మ అ ఆ" అన్నాడు మురళి.

అతని కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

"మ అ ఆ" అన్నాడు మళ్ళీ.

"లైసెన్సులేని నీ మ అ ఆ ను మ్యునిసిపాలిటీ వాళ్ళు పట్టుకుపోయారు చంపడానికి" అంది సౌభాగ్యమ్మ.

మురళి కది ఏం అర్థం కాలేదు.

"మ అ ఆ !" అన్నాడు.

కుక్కపిల్ల రాలేదు.

తన గదికి వెళ్ళాడు. వెదికాడు. భారతి ఫోటో కన్పించింది. కాలితో ప్రక్కకు నెట్టాడు. చేతికి తీసుకొని దాన్ని ముక్కలుగా చించిపారేశాడు.

"మ అ ఆ!" అన్నాడు.

రాలేదు అతని కుక్కపిల్ల.

వీధిలోకి పరుగెత్తాడు.

"మ అ ఆ!" అని అరిచాడు.

పిల్లలు అతన్ని చూసి నవ్వారు. మ్యునిసిపాలిటీ వాళ్ళు చంపివేయడానికి పట్టించింది సౌభాగ్యమ్మ అన్నట్లు సంజ్ఞచేసి చెప్పాడు ఒక కుర్రాడు.

"మ అ ఆ" అని గట్టిగా ఏడ్చాడు మురళి.

ఎటో పరుగెత్తాడు మురళి.

"మ అ ఆ!" అంటూ రోదించాడు మురళి.

మళ్ళీ తిరిగి రాలేదు మురళి.

మళ్ళీ తిరిగి రాలేదు అతని "మ అ ఆ!"

రోదించలేదు ఎవరూ మురళి కోసం.

నిట్టూర్చలేదు ఒక్కరూ "మ అ ఆ" కోసం.

✸

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 22-7- 1964.